క్లుప్తంగా

ఘనంగా అహల్యాబాయి ఉత్సవాలు



అల్లాపురం(గన్నవరం): మండలంలోని అల్లాపురంలోని శ్రీసాయిబాబా మందిరంలో శుక్రవారం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో పుణ్యశ్లోక లోకమాత అహల్యాబాయి త్రిశతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సమరసత వేదిక ప్రాంత సంయోజిక్ రాజారామచంద్ర, గన్నవరం ఖండ సంయోజిక వై. పాండురంగారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ మహారాణి అహల్యాబాయి రాజ్యవిస్తరణ, పరిపాలన మాత్రమేకాక సామాజికంగా అనేక సంస్కరణలు తీసుకొచ్చారని తెలిపారు. మహిళా సాధికారతకు ఆమె కృషి చేశారన్నారు. సమరసత వేదికకు చెందిన కె. రామకృష్ణ, నారాయణరావు, దుర్గాప్రసాద్, శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగ ఉద్యోగులకు న్యాయం చేయాలి

పెనమలూరు: దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలని ఆ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అదనపు కార్యదర్శి ప్రేమ్‌సుధాకర్ కోరారు. ఆయన శుక్రవారం గంగూరులో విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగుల చట్టం 2016 ప్రకారం దివ్యాంగ ఉద్యోగులు సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా ఎదిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియారిటీ జాబితాలో దివ్యాంగుల ఉద్యోగ కోటా పారదర్శకంగా అమలు చేయాలని, ప్రమోషన్లలో నాలుగు శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్నారు. సచివాలయాలలో పని చేస్తున్న దివ్యాంగ ఉద్యోగులకు ఫీల్డ్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

నీటిలో కోడిఈకలు



అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామ ప్రజలకు వింతైన అనుభవం ఎదురైంది. శుక్రవారం ఉదయం పంపుల్లో వచ్చే నీటిని పట్టుకుంటున్న మహిళలకు నీటిలో కోడిఈకలు కనిపించడంతో కంగారు పడ్డారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిశుభ్రమైన నీరు సరఫరా చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

రథోత్సవంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు రథోత్సవంతో శుక్రవారం ముగిశాయి. చివరి రోజు గ్రామ పురవీధుల్లో స్వామి వార్ల రథోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తొలుత దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్.హేమలతాదేవి రథోత్సవాన్ని ప్రారంభించారు. స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి భక్తుల నృత్యాలు, కోలాటం మధ్య రథోత్సవం నిర్వహించారు. ప్రధానార్చకులు శివాచార్య, డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ ఆశీసులై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాల్లో శ్రీలలిత త్రిపుర సుందరీదేవి పీఠాధిపతి మునీంద్ర మహారాజ్, వేద పండితులు ఉదయభాస్కరశర్మ, అయ్యప్ప, మామిళ్లపల్లి వెంకటేష్, కె.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి



గన్నవరం రూరల్: జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ముస్తాబాద రిలయన్స్ గోడౌన్‌లో పని చేస్తున్న కార్మికుల ఉద్యోగాలు కాపాడాలని, వారికి జీవన భృతి కల్పించాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి కోరారు. రిలయన్స్ గోడౌన్ వద్ద నాలుగు రోజులుగా ఉద్యోగాలు కోల్పోయి ఆందోళన చేస్తున్న కార్మికులను శుక్రవారం పరామర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిలయన్స్ గోడౌన్‌లో సుమారు 250 మంది పని చేస్తుంటే వారికి ఏ నోటీసులు ఇవ్వకుండా తొలగించటం అన్యాయమన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వీరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఏ నోటీసులు ఇవ్వకుండా గోడౌన్ మూసివేయటం, సరైన సమాధానం చెప్పకపోవటం అన్యాయమన్నారు. కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, ఐశ్వర్య, సుమలత, కిషోర్, మౌనిక, ప్రసాద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు

- గ్రామాల్లో 24 గంటలు అందుబాటులో మద్యం
- ప్రోత్సహిస్తున్న టీడీపీ నాయకులు
- కన్నెత్తి చూడని ఎక్సైజ్ అధికారులు



బల్లెంవారి వీధిలో ప్రధాన రహదారిపై వైన్ షాపు

రామవరప్పాడు : విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లో మద్యం ఎరులై పారుతోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా 24 గంటలు మద్యం దొరుకుతుంది. ప్రతి గ్రామంలో బెల్టు షాపులను టీడీపీ నాయకులు ప్రోత్సహిస్తూ తమ జేబులు నింపుకుంటున్నారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో నిబంధనలు అతిక్రమించి బెల్టుషాపు నిర్వాహకులు బరితెగిస్తోన్న ఎక్సైజ్ అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. రామవరప్పాడు బల్లెం వారి వీధిలో పక్క పక్కనే రెండు మద్యం షాపులున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ మద్యం షాపులు టీడీపీ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్నాయి. బెల్లంవారి వీధిలో శక్తి రూరల్ వైన్ షాపు నివాసాలకు ఆనుకుని, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్నారని గతంలో స్థానికులు ఆందోళన నిర్వహించారు. నిత్యం మహిళలు, విద్యార్థులు రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దని నిరసన వ్యక్తం చేశారు. అయితే రాత్రికి రాత్రి మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. దీనికి సమీపంలో మరో వైన్ షాపును కూడా ఏర్పాటు చేయడంతో నిత్యం మందు బాబుల గొడవలు, అల్లర్లలతో ఈ ప్రాంత వాసులకు కంటి మీద కునుకు కరువైంది. వైన్స్ షాపునకు వచే వారి వాహనాలను ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేస్తుండటంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూమ్

రామవరప్పాడు బల్లెంవారి వీధిలో నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసినా ఎక్సైజ్ అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాంతంలోని వైన్ షాపునకు ఆనుకుని రేకుల షెడ్డును ఏర్పాటు చేశారు. దీంతో మందుబాబులు ఇక్కడే మద్యం తాగుతూ వారిలో వారు గొడవలకు దిగుతున్నారు. ఈ మార్గంలోనే ఎస్సీ శ్మశానవాటిక సమీపంలో మరో వైన్ షాపును ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా రహదారిపై, శ్మశానం చుట్టూ మందు బాబులు మద్యం తాగుతూ ప్రయాణికులకు అవాంతరాలు సృష్టిస్తున్నారు.



రామవరప్పాడులో ఏర్పాటు చేసిన పర్మిట్ రూమ్‌లో మందుబాబులు

ఒక్కో దుకాణానికి రూ.3 లక్షల వసూలు

రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లో కాల్వగట్టు ప్రాంతాలతో పాటు ప్రధాన గ్రామంలో బెల్టుషాపులు వెలిశాయి. ప్రసాదంపాడు ఎస్‌సీఆర్ సెంటర్‌కు చెందిన ఓ టీడీపీ నాయకుడు ఈ బెల్టు షాపుల ఏర్పాటులో కీలకపాత్ర పోషిస్తున్నాడు. బెల్టుషాపునకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు వసూలు చేసి, తమ అనుచరులతో బెల్టుషాపులు ఏర్పాటు చేయించాడు. ప్రసాదంపాడు పంచాయతీ కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా పనిచేసే ఓ వ్యక్తికి కూడా బెల్టుషాపును కేటాయించాడు. అలాగే ఎనికేపాడులో మాజీ సర్పంచ్ కుమారుడు బెల్టుషాపుల కేటాయింపు బాధ్యత తీసుకున్నాడు. ఈ ఒక్క గ్రామంలోనే సుమారు ఏడుకు పైగా బెల్టుషాపులు ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

వైన్ షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేయడానికి అనుమతులు లేవు. బెల్టు షాపుల్లో అనధికారికంగా మద్యం విక్రయించడం నేరం. పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపులను గుర్తించి చర్యలు తీసుకుంటాం. గతంలో పలుమార్లు హెచ్చరించి కేసులు కూడా నమోదు చేశాం.

– పెద్దిరాజు, ఎక్సైజ్ సీఐ

అధిక ధరలకు మద్యం

రూరల్ మండలంలోని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. గ్రామానికి ఐదారు బెల్టుషాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నా వీరికి పట్టడం లేదు. బహిరంగంగా పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసినా వీరికి పట్టడం లేదు. ఇకనైనా బెల్టుషాపులను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

కంకిపాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పెనమలూరు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

నియమితులైన నాయకులు వీరే..

యువజన విభాగం-గద్దం చైతన్య, మహిళా విభాగం-నందిపాటి బిందుమాధవి, రైతు విభాగం-మాగంటి శ్రీనివాసరావు, బీసీ సెల్ -మండూరి కోటేశ్వరరావు, ఎస్సీ సెల్-చుండూరు శేఖర్, ఎస్టీ సెల్-రమావత్ శ్రీకాంత్, మైనార్టీ సెల్ -అబ్దుల్ గనీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్-నంబూరి ప్రసాద్, విద్యార్థి విభాగం- భీమవరపు సాయి నితీష్ రెడ్డి, పంచాయతీ విభాగం-గెత్తం విజయ్‌కుమార్, మున్సిపల్ విభాగం-షేక్ ఖాదర్‌బాషా, ఆర్‌టీఐ విభాగం-షేక్ అబ్దుల్ సిద్దిఖ్, వలంటీర్ల విభాగం-కె.మధుయాదవ్, గ్రీవెన్స్ సెల్-ఎండీ అన్వరుద్దీన్, వాణిజ్య విభాగం-ఊర నాగిన్, వీవర్స్ వింగ్-గణపవరపు కాళిదాస్, వైఎస్సార్‌టీయూసీ-మాదు విజయ్‌కుమార్, అంగన్‌వాడీ విభాగం -కర్రా జోజ్ మేరీ, లీగల్ సెల్-పల్లి అశోక్, సాంస్కృతిక విభాగం-గుమ్మడి అన్వేష్, సోషల్ మీడియా విభాగం -దిరిశం ఇందిరా ప్రియదర్శిని, ఐటీ విభాగం-నల్లమోతు జీవన్‌కుమార్, దివ్యాంగుల విభాగం -ఎండీ ఇబ్రహీం, డాక్టర్స్ విభాగం-చక్కా గోపి, ఇంటిలెక్చువల్స్ వింగ్-పిడికిటి రామకోటేశ్వరరావు, బూత్ కమిటీ విభాగం-ఆరేపల్లి శ్రీకాంత్‌కుమార్, పబ్లిసిటీ విభాగం-పి.కృష్ణమూర్తి నియమితులయ్యారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కానూరులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శేషగిరిరావు

పెనమలూరు: మండల పరిధిలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖ అధికారి శేషగిరిరావు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు ఉంటాయన్నారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు 2,515 మంది పరీక్షకు హాజవుతారని తెలిపారు. ఓపెన్ స్కూల్ విద్యార్థులు 170 మంది కూడా పది పరీక్ష రాస్తారన్నారు. పరీక్షలకు 12 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సెట్-1 పరీక్ష పత్రాలు పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు శుక్రవారం వచ్చాయని, సెట్-2 పరీక్ష పత్రాలు శనివారం వస్తాయని పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాల్‌టికెట్‌లతో రావాలని ఎంఈఓ శేషగిరిరావు తెలిపారు.

ఉంగుటూరులో 625 మంది..

ఉంగుటూరు: మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 625 మంది 10వ తరగతి విద్యార్థులు ఈ నెల 17 నుంచి పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ-2 సాంబశివరావు తెలిపారు. మండలంలో మానికొండ, తేలప్రోలు, ఉంగుటూరు, ఇందుపల్లి, ఆత్కూరు, పెద్ద అవుటపల్లి, ఆత్కూరు(గుడ్రస్) మొత్తం ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు తాగునీరు, మెడికల్ అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.

కానూరులో సినిమా షూటింగ్



సినిమా షూటింగ్ పార్రంభిస్తున్న దృశ్యం

పెనమలూరు: కానూరు తులసీనగర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో లగ్జరీ లైఫ్ సినిమా షూటింగ్ శుక్రవారం ప్రారంభించారు. కొత్త తారాగణంతో ఎస్‌ఎంఆర్ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కనున్న లగ్జరీలైఫ్ సినిమాకు ప్రత్యేక పూజలు నిర్వహించి ముహూర్తం షాట్ నిర్వహించారు. చిత్ర విశేషాలను కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహిస్తున్న రెడ్రౌత్ మల్లేష్‌నాయుడు వివరించారు. ప్రస్తుత సమాజంలో యువశక్తి ఎంత అవసరమో తెలిపే విధంగా సినిమా నిర్మిస్తున్నామన్నారు. యువత అమ్మాయిల మోజులో పడి మానవీయ విలువలను మర్చిపోతున్న పరిస్థితులను చూపుతామన్నారు. సినిమా షూటింగ్ మొత్తం ఏపీలోనే జరుగుతుందని తెలిపారు. నిర్మాత మాస్టర్ లీలావతి, సహ నిర్మాత సూర్యప్రకాష్, నటులు కల్యాణి దేవలపర్స్ అధినేత నర్రాఉదురు చౌదిరి, కోడూరి రఘునాథరెడ్డి నటిస్తున్నారు.

దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన



సుగాలిపేట వాసులతో మాట్లాడుతున్న ఎస్ఐ

గన్నవరం: ఓ యువకుడిని కొట్టడంతో పాటు కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సూరంపల్లిలోని సుగాలిపేట వాసులు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మండలంలోని సూరంపల్లి శివారు సుగాలిపేటలో హోలీ సందర్భంగా రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. అదే సమయంలో ఆటోలో వెళ్తున్న అంగిరేకుల నాగరాజు షర్టుపై రంగులు పడడంతో ఆగ్రహానికి గురయ్యాడు. కల్కి అనే యువకుడిని నాగరాజు మందలించడంతో పాటు గొడవకు దిగాడు. అంతేకాకుండా నాగరాజు ఫోన్లో ఫిర్యాదు చేయడంతో గన్నవరం పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడే క్రమంలో మరోసారి గొడవ చోటుచేసుకుంది. దీంతో రెచ్చిపోయిన నాగరాజును తమను కులం పేరుతో దూషించారని సుగాలిపేట వాసులు ఆరోపించారు. ఈ విషయమై గన్నవరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నాగరాజుపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో పోలీస్‌స్టేషన్ ఎదుట సుగాలిపేట వాసులు ఆందోళనకు దిగారు. స్పందించిన ఎస్ఐ శ్రీధర్ సుగాలిపేట వాసులతో మాట్లాడి ఫిర్యాదు స్వీకరించడంతో శాంతించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

టీడీపీ నాయకుల మట్టి దోపిడీ

- చెరువు మట్టిని ప్రైవేటు స్థలంలోకి తరలింపు
- రూ.లక్షల్లో పంచాయతీ ఆదాయానికి గండి



నిడమానూరులో చెరువు మట్టిని ప్రైవేటు స్థలంలోకి తోలిన వైనం

రామవరప్పాడు: తట్ట మట్టి బయటకు పోనీయం, ప్రభుత్వ ఆదాయానికి గండి పెట్టబోమని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేస్తున్న ప్రకటనలు మాటలకే పరిమితమవుతున్నాయి. తాము చెప్పేదొకటి చేసేదొకటంటూ వందల ట్రాక్టర్ల మట్టిని అక్రమంగా టీడీపీ నాయకులు ప్రైవేటు స్థలంలోకి తోలించడం వివాదాస్పదమైంది. విజయవాడరూరల్ మండలం నిడమానూరు ప్రధాన రహదారి వెంబడి ఉన్న చెరువును ఇటీవల పంచాయతీ ఆధ్వర్యంలో పూడిక తీయించారు. చెరువును అభివృద్ధి పరుస్తున్నామంటూ హడావుడీ చేస్తూ జేసీబీ సాయంతో చెరువులోని మట్టిని తోడించారు. పూడిక తీయగా వచ్చిన మట్టిని ట్రాక్టర్లతో జాతీయరహదారిపై ఆహా హోటల్ వెనుక గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడికి చెందిన స్థలంలో పంచాయతీ కార్యదర్శి ఎన్. నరసింహరావు దగ్గరుండి తోలించడం వివాదాస్పదమైంది.

నిబంధనలు తుంగలో తొక్కి..

ప్రభుత్వ ఆస్తి అయిన చెరువు మట్టిని ప్రభుత్వ స్థలాలు, శ్మశానాలు చదును చేయడానికి ఉపయోగించాలి. లేకుంటే నిబంధనల ప్రకారం పంచాయతీ పాలకవర్గ సమావేశంలో తీర్మానం పొందిన తర్వాత పత్రిక ప్రకటన ద్వారా వేలం పాటకు ఆహ్వానించి హెచ్చుపాట పాడిన వారికి అప్పగించాలి. అయితే ఇవేమీ పట్టని పంచాయతీ కార్యదర్శి టీడీపీ నాయకులకు ప్రయోజనం చేకూరేలా ఏకపక్షంగా వ్యవహరించారు. సుమారు 400 ట్రాక్టర్ల మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా టీడీపీ నాయకుని స్థలంలో తోలించారు. దీంతో ప్రభుత్వానికి రూ.లక్షల్లో రావాల్సిన ఆదాయానికి గండి పడినట్లు అయింది. ఈ మట్టి దోపిడీపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ ఘటనపై పంచాయతీ రాజ్ ఏఈ శివరామకృష్ణను వివరణ కోరగా నిబంధనల ప్రకారం పంచాయతీ తీర్మానం పొందిన తర్వాత వేలంపాట నిర్వహించి హెచ్చు పాడిన వారికి అప్పగించాలని పేర్కొన్నారు.

27, 28 తేదీల్లో వికసిత్ ఫెస్ట్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఈ నెల 27,28 తేదీల్లో వికసిత్ ఫెస్ట్ జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ వీఎస్ పరమేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జాతీయ ఫెస్ట్ బ్రోచర్‌ను కళాశాల చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి ఆవిష్కరించారు. ఈ ఫెస్ట్‌లో 13 టెక్నికల్ అంశాలు నిర్వహిస్తున్నామన్నారు. పలు రాష్ట్రాలకు చెందిన వివిధ కళాశాలల విద్యార్థులు ఫెస్ట్‌లో పాల్గొని నూతన సాంకేతిక విధానాలపై చర్చించడం, నూతన ఆవిష్కరణల నమూనాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ సేవ్ రాజన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీఎస్ఎల్ కీర్తి, కన్వీనర్ బి.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని వివాహిత అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మతి స్థిమితం లేని వివాహిత అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఘటనపై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా సారవకోట బద్రి గామానికి చెందిన బలగ రమణయ్య, పద్మలు భార్యాభర్తలు. జీవనోపాధి నిమిత్తం నగరానికి వలస వచ్చి కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. 12వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో భార్యాభర్తలిద్దరూ నిద్రపోయారు. రెండు గంటల సమయంలో రమణయ్యకు మెలుకువ వచ్చి చూడగా పద్మ కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ప్రసాదాల పంపిణీపై హర్షం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణలో దేవస్థానం భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేయడంతో శ్రీ శబరిమల అయ్యప్ప సేవా సమాజం ఏపీ కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయ్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కొంత కాలంగా గిరి ప్రదక్షిణ సమయంలో దేవస్థానం ప్రసాదాల పంపిణీని నిలిపివేసింది. దీంతో అయ్యప్ప సేవా సమాజం ప్రతినిధులు ఆలయ ఈఓకు పత్రికా రూపంలో తెలియజేయడం, దేవస్థానం వెంటనే స్పందించి ప్రసాదాలను అందించినట్లు బుల్లబ్బాయ్ పేర్కొన్నారు. సేవా సమాజం అధ్యక్షుడు ఎస్.వాసు, సెక్రటరీ వెంకయ్య, రామకృష్ణ, మారుతీలు దేవస్థాన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

కోడూరుపాడులో అయ్యప్ప జన్మదిన పూజోత్సవం



అయ్యప్పకు అభిషేకం చేస్తున్న మురళీధర్ నంబూద్రి, గురు స్వాములు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో అయ్యప్పస్వామి జన్మదిన పూజోత్సవం శుక్రవారం వైభవోపేతంగా జరిగింది. గ్రామానికి చెందిన గురుస్వామి చందు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చందు రమాదేవి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప జన్మదిన పూజలు, ఉచిత వైద్య శిబిరం, మహా అన్నప్రసాద వితరణ నిర్వహించారు. గ్రామంలోని కోదండరామస్వామి దేవస్థానం ప్రాంగణంలో కేరళ సాంప్రదాయ పద్ధతిలో కె.మురళీధర్ నంబూద్రి నేతృత్వంలో అయ్యప్పకు ప్రత్యేక పూజలు జరిగాయి. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. అయ్యప్ప జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ కార్డియాలజిస్ట్ నరాలశెట్టి అనిల్‌కుమార్, న్యూరాలజిస్టులు తోట నవీన్, చందు సాంబశివరావులు వైద్య సేవలు అందించారు. సాయంత్రం గ్రామంలో అయ్యప్పను కేరళ సాంప్రదాయ వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు.

ఉత్సాహంగా హోలీ వేడుకలు



బోడపాడులో హోలీ సంబరాలు



గన్నవరంలో రంగులు చల్లుకుంటున్న వాకర్స్

గన్నవరం: హోలీ వేడుకలను గన్నవరం ప్రాంతంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు జరుపుకున్నారు. పర్యావరణ హితమైన రంగులు చల్లుకుంటూ వాకర్స్ సందడి చేశారు. సీనియర్ సిటిజన్స్‌తో పాటు మహిళా వాకర్స్ కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. వాకర్స్ అధ్యక్షుడు కేవీఆర్. కిషోర్, గౌరవ సలహాదారుల తిరివీధి వెంకయ్య, వాకర్స్ చిమట రామారావు, విజయ కుమార్, బాబురావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక శ్రీనగర్‌కాలనీ, రాయ్‌నగర్, రామ్‌నగర్, కొత్తపేట తదితర ప్రాంతాల్లో చిన్నారులు రోడ్లపై రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

నున్నలో..

నున్న(విజయవాడరూరల్): నున్న, పాతపాడు గ్రామాల్లోని లంబాడీలు శుక్రవారం హోలీ సంబరాలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఉత్సాహంగా ఒకరి పై ఒకరు రంగునీళ్లు చల్లుకున్నారు. సంప్రదాయ దుస్తులను కొందరు మహిళలు ధరించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో వేడుకలను చేసుకున్నారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీ కల్యాణం



రాజ్యలక్ష్మీ, నరసింహుని కల్యాణం



వేణుగోపాలస్వామి మూలమూర్తులకు విశేష అలంకారం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ కోదండరామాలయంలో లక్ష్మీకల్యాణం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. లక్ష్మీ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో పలు ప్రత్యేక కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. ఉదయం ఆలయంలోని రాజ్యలక్ష్మీ, నరసింహస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక తిరుమంజన అభిషేకాలను నిర్వహించారు. పలు సుగంధద్రవ్యాలతో పాటుగా పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించి విశేష అలంకారం చేశారు. మధ్యాహ్నం రాజ్యలక్ష్మీ, నరసింహస్వామి వార్ల శాంతి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉభయదాతలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అర్చకస్వాములు రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు కార్యక్రమాలను నిర్వహించారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కొత్తపేటలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో స్వామి కల్యాణోత్సవ వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకారం చేసి స్వామిని పెండ్లికుమారుడిగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. శుక్రవారం అర్ధరాత్రి స్వామి కల్యాణోత్సవం, శనివారం స్వామి వారి నగరోత్సవాలను నిర్వహిస్తామని ఆలయ అర్చకస్వాములు తెలిపారు.

కారల్‌మార్క్స్‌కు ఘన నివాళి

కంకిపాడు: శ్రామిక జనచైతన్యమే లక్ష్యంగా జీవితాంతం కృషి చేసిన కారల్ మార్క్స్ ఆదర్శప్రాయుడని సీపీఎం మండల నాయకుడు చిక్కవరపు శ్రీహరి అన్నారు. మండలంలోని ఉప్పలూరు సీపీఎం కార్యాలయం వద్ద కారల్ మార్క్స్ వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. మార్క్స్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు ఎం.చంటిబాబు, వి.రమేష్, చిక్కవరపు రెడ్డయ్య, ఆంజనేయులు, సీతారామయ్య పాల్గొన్నారు.

మధురంగా సాగిన సంగీత కచేరీ

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాహిత్య సేవాసంస్థ నెలవారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద శుక్రవారం నిర్వహించిన కర్నాటక గాత్ర సంగీత సభ సుమధురంగా సాగింది. గాయని లలితాచంద్రశేఖర్ శ్రీరాగం వర్ణంతో ప్రారంభించి ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన గణపతే, హిరణ్మయీం లలితాం, ఓగిరాల వీరరాఘవశర్మ రచించిన నేడే ననుసేవింప, త్యాగరాజస్వామి కీర్తన బ్రోచేవారెవరే, అన్నమాచార్య సంకీర్తన ధర్మవతి, రామదాసు కీర్తన రామభద్ర కీర్తనలను మధురంగా ఆలపించారు. వయొలిన్‌పై దుర్గాభవానీ, మృదంగంపై మంగళగిరి శ్రీధర్ వాద్య సహకారం అందించారు. స్వరఝరి సంస్థ అధ్యక్షుడు సీతారామచంద్రమూర్తి సంతాప సభను కూడా ఇదే వేదికమీద నిర్వహించారు.

పేకాట శిబిరంపై దాడి

ఉయ్యూరురూరల్: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.74,650, ఏడు మోటార్ వాహనాలను స్వాధీన పరుచుకున్నట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.